విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 30 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ప్రచారం ఉద్ధృతం

జనంలోనే అభ్యర్థులు

- నేడు జగన్, లోకేష్, బాలకృష్ణ రాక
- 3న పవన్ కళ్యాణ్ రాక
- అగ్రనేతల పర్యటనలతో జోష్‌లో అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల పర్వం, నామినేషన్ల పరిశీలన, విత్ డ్రాలు ముగిశాయి. ఇక ప్రచారం ఉధృతంగా సాగుతుంది. దీనికి తోడు వైసీపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు, ముఖ్యనేతలు జిల్లాపై దృష్టి సారించారు. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండటంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. వీరితో పాటు వారి కుటుంబ సభ్యులు, సతీమణులు, కుమారులు, కోడళ్లు, ఇలా అందరూ ప్రచారంలో మునిగి తేలుతున్నారు. గెలుపే లక్ష్యంగా సామ దాన దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. మరోపక్క డబ్బు, మద్యం పరవళ్లు తొక్కుతుంది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పట్టణం, పల్లె తేడా లేకుండా మైకులు హోరెత్తుతున్నాయి. వైకాపా, టీడీపీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. ఎలాగైనా ఈ ఎన్నికల్లో విజయం సాధించి తెలుగుదేశం పార్టీని భూ స్థాపితం చేయాలని వైకాపా భావిస్తుండగా మరోసారి వైకాపా అధికారంలోకి వస్తే ఇక పార్టీ మనుగడ ఇబ్బందిగా ఉంటుంది ఎలాగైనా ఎన్నికల్లో విజయం వైపు దూసుకుపోవాలంటూ టీడీపీ నేతలు కసితో ఉన్నారు. మొత్తం మీద ఎన్నికలు ప్రచారం ఉధృతంగానే హోరా హోరీగా సాగుతుంది.

నేడు ముఖ్యమంత్రి జగన్ రాక :

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి నేడు టంగుటూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ గత రెండు రోజులుగా జగన్ పర్యటనపై దృష్టి సారించారు. టంగుటూరు, జరుగుమల్లి, శింగరాయకొండ మండలాల నుంచి ముఖ్యనేతలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో జనసమీకరణపై దృష్టి మిగతా 2 లో ...

నేడు

కొండెపిలో బాల వీరాంజనేయస్వామి కోసం బాలకృష్ణ ప్రచారం

ఒంగోలులో దామచర్ల జనార్ధన్ కోసం నారా లోకేష్ ప్రచారం



1200 మంది పోలీసులతో మూడంచెల భద్రత

నేడు టంగుటూరులో జగన్ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-టంగుటూరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు కొండపి నియోజకవర్గం టంగుటూరుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్నారు. జగన్ రోడ్డు షో కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ 1200 మంది పోలీసులతో మూడంచల కట్టుదిట్టమైన పటిష్ట భద్రతను ఏర్పాటు చేసారు. ముందుగా హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించి అనంతరం రోడ్ షో నిర్వహించే ట్రంకు రోడ్డును అగ్నిమాపక శాఖ విద్యుత్ శాఖ వారితో కలిసి పరిశీలించి వారికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు సూచనలు చేశారు. సాయంత్రం టంగుటూరులో రోడ్ షో మాక్ డ్రిల్ నుఎస్పీ నిర్వహించారు. జగన్ రోడ్ షో ను లివిజయవంతం చేయాలి: డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నేడు జరగనున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార రోడ్ షో ను విజయవంతం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మిగతా 2 లో ...

కళాశాల బస్సు ఢీకొని విద్యార్థి మృతి 3 లో..

1న చీరాలకు చంద్రబాబు

ఏర్పాట్లు చేస్తున్న అభ్యర్థి కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మే నెల ఒకటవ తారీఖున చీరాలలో జరిగే బహిరంగ సభకు తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఆయన బహిరంగ సభను జాతీయ రహదారి 216 పక్కన ఉన్న స్థలంలో నిర్వహించనున్నారు. ఈ బహిరంగ సభ ఏర్పాట్లలో భాగంగా హెలిపాడ్ నిర్మాణం, బహిరంగ సభ వేదిక నిర్మాణం కోసం సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజక వర్గ తెదేపా, భాజపా, జన సేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఎం ఎం కొండయ్య, తెదేపా నాయకులు బాచిన చెంచు గరటయ్య, సలగల రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైకాపా అరాచక పాలనలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైకాపాను సాగనంపడానికి, కూటమి ప్రభుత్వాన్ని అధికారం లోకి తేవడానికి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అఖండ మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించడానికి సంసిద్ధులై ఉన్నారన్నారు. చంద్రబాబు సభకు పెద్ద యెత్తున తెదేపా, భాజపా, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

ఓటర్లను భయపెడితే ఉపేక్షించం

- 3500 మందితో పటిష్ట బందోబస్తు
- జిల్లాలో రూ.4 కోట్ల మేర నగదు, మద్యం సీజ్
- మీడియాతో ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల :

ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన ప్రలోభాలకు చేసిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీస్ శాఖ నుండి అన్ని ముందస్తు భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం 1510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 337 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ స్థాయిలో పోలీస్ బలగాలను మోహరించడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక గ్రామాలలో ముందు నుండే కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నామని, ఆ గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆ గ్రామాలలో ఉన్న పాత నేరస్తులు, అల్లర్లు సృష్టించడానికి అవకాశం ఉన్న వారిని బైండోవర్ చేయడం జరిగిందని పోలీస్ అధికారులు తరచూ ఆ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా వారి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా పరిధిలో మొత్తం 18 చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిలో 9 చెక్ పోస్ట్‌లు జిల్లా సరిహద్దులలో 9 చెక్ పోస్ట్‌లు జిల్లా అంతర్గతంగా ఏర్పాటు చేశామని నిరంతరాయంగా వాహన తనిఖీలు నిర్వహించేందుకు సిబ్బందిని కేటాయించామన్నారు. మే 13న జరగనున్న ఎన్నికలకు సుమారు 3500 మంది పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1500 మంది పోలీసులు బలగాలు ఉన్నాయన్నారు. కేంద్రం నుంచి 1000 మంది సాయుధ బలగాలను, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పోలీసు బలగాలు వస్తాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం సుమారు రూ. 4,77 కోట్ల విలువ గల నగదు, వస్తువులు, అక్రమ మద్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్పీ వివరించారు.

టీడీపీ, వైసీపీలకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే

ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి జేడీ శీలం

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ వైసీపీలు బీజేపీకి తొత్తు పార్టీలని ఈ రెండు పార్టీల అభ్యర్థులలో ఎవరికి ఓటు వేసిన బీజేపీకి ఓటు వేసినట్లే అని మాజీ కేంద్రమంత్రి బాపట్ల ఇండియా కుటమి అభ్యర్థి జేడీ శీలం తెలిపారు. కలెక్టరేట్ వద్ద మీడియాతో శీలం మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశ సమగ్ర అభివృద్ధి కోసం స్వేచ్ఛాయుత వాతావరణం కోసం ఇండియా కుటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మతాలు కులాల మధ్య మిగతా 2 లో ...

మే డే వేడుకలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-దర్శి : మే 1వ తేదీ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా దర్శి పట్టణంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించుచున్నట్లు దర్శి నియోజకవర్గం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కోటంశెట్టి హనుమంతరావు, ఏఐటియుసి ఉపాధ్యక్షుడు జే, కోటేశ్వరరావు,ఆర్డబ్ల్యూఎస్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింగరకొండ శ్రీనివాసరావు, మార్బుల్ అండ్ టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కాశిరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నాయకులు మాట్లాడుతూ 1వ తేదీ ఉదయం 8 గంటలకు కురిచేడు రోడ్డులో ఉన్న ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద కార్మిక జెండాను రాష్ట్రఏఐటీయుసీ అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆల్ డబ్ల్యూ ఎస్ యూనియన్ జెండాను ఆవిష్కరించి అనంతరం కార్మిక సంఘాలర్యాలీని ప్రారంభిస్తారని వారు తెలిపారు. అక్కడి నుండి ర్యాలీ బయలుదేరి బస్టాండ్ సెంటర్లో, పొదిలి రోడ్లో,అద్దంకి రోడ్లో సిపిఐ కార్యాలయం వద్ద ఏఐటియుసి జెండాలను ఆవిష్కరిస్తూ ఎన్ఎస్పి కార్యాలయ వద్ద జెండావిష్కరణ వరకు కొనసాగుతుందనీ తెలిపారు. ఈ మేడే కార్యక్రమానికి ఏఐటీయూసీ అనుబంధకార్మిక సంఘాల అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే సుభాని, యేసు రత్నం, అంకాల బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది రెన్యుమరేషన్‌పై ఎలక్షన్ కమిషనర్ పునఃపరిశీలించాలి

టీచర్స్ గిల్డ్ వినతి

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రస్తుతం ఎన్నికలలో పాల్గొనే సిబ్బందికి ఏపీవో, ఇతర పోలింగ్ ఆఫీసర్లకు ఇచ్చే రూ.250 రిన్యుమరేషన్ 500 రూపాయలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ టీచర్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 200 కిలోమీటర్ల పైనే చాలామంది పోలింగ్ సిబ్బందిని విధులకు నియమించారు. కనుక రెండు రోజులకు ట్రావెలింగ్ అలవెన్స్ చెల్లించాలని ఎన్నికల కమిషనర్ ముకేశ్ కుమార్ మీనాను కోరినారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు జూన్ నెలలో పదవి విరమణ పొందే ఉద్యోగులు వికలాంగులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. పోలింగ్ అనంతరం నియోజకవర్గాలలో మెటీరియల్ సేకరించి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

1200 మంది పోలీసులతో మూడంచెల భద్రత

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక టంగుటూరులోని ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదిమూలపు సురేష్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి కొండేపిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని సంకల్పంతో ప్రకాశం జిల్లాలోని కొండేపి నియోజకవర్గానికి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని అన్నారు. కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా విభేదాలు వీడి పార్టీ గెలుపు కోసం పని చేయాలని అన్నారు. పార్టీలోనే ఉంటూ పార్టీకి నమ్మకద్రోహం చేసే వారిని ఉపేక్షించ బోమని హెచ్చరించారు. టంగుటూరుకు జగన్ వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్క వైయస్సార్ అభిమాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంపీటీసీలు జడ్పీటీసీలు సర్పంచులు భారీ ఎత్తున హాజరై ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండేపి నియోజక వర్గంలోని 6 మండలాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ గెలిస్తే మీ ఆస్తులు లాక్కున్నట్టే

ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-టంగుటూరు : రాష్ట్రంలో సీఎం జగన్మోహన్ రెడ్డి మళ్ళీ గెలిస్తే మీ భూములపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పొందూరు, ఎం నిడమనూరు, మర్లపాడు, కందులూరు, మల్లవం పాడు, కారుమంచి గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజా ఆస్తులను దోచుకోవాలన్న లక్ష్యంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం అమల్లోకి తీసుకు వస్తుందని, ఆ చట్టం వల్ల భూ యాజమాన్య హక్కులన్నీ ప్రభుత్వం చేతులకు వెళ్తాయని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని అందువల్లే మేనిఫెస్టో కూడా ఒక మానసిక రోగి తరహాలో ఇవ్వడం రాష్ట్ర ప్రజలను ఆశ్చర్యాన్ని గురు చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో బాబు సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందాయన్నారు. వైసిపి అధికారంలో ఉండి కూడా జగన్మోహన్ రెడ్డి మన జిల్లాకు వలస పక్షులను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చిన ఆదిమూలపు సురేష్‌ను మీ ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మాగుంట కుటుంబం, దామచర్ల కుటుంబం గత 30 ఏళ్లుగా ప్రజాసేవలో మీ ముందు స్వచ్ఛమైన రాజకీయం చేసిన రాజకీయ నాయకులుగా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ కూర్చున్న వలస పక్షులు ఇద్దరు అవినీతి ఆరోపణలో మునిగి తెలారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ పవిత్రమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న మర్లపాడు పంచాయతీలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ పావులూరి కోటయ్య, బుర్ర తిరుపతి స్వామి, రావులపల్లి వెంకటేశ్వర్లు, కుమారి, కోటేశ్వరరావు, అశోక్, ముప్పరాజు కిషోర్, పటాన్ మౌలాలి, తోపాటు వారికి చెందిన వారి కుటుంబాల వారు ఎంఎల్ఏ స్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సింగరాయకొండ మండలం ఉల్లపాలెం గ్రామానికి చెందిన పలువురు గొల్లపోతు స్వాములు మరియు వారి చందన పది కుటుంబాల వారు వైసిపి నాయకులు స్వామి సమక్షంలో టిడిపిలో చేరగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టంగుటూరు మండలంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో మర్రిపూడి మండలం శివరాయునిపేట ఎస్సీ కాలనీకి చెందిన అంబటి కిరణ్, అంబటి విష్ణు, అంబటి వర కుమార్, అంబటి సదానందం, వారు వారి కుటుంబ సభ్యులు గురజాల ఏసుపాదం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, బెల్లం జయంత్ బాబు, తోపాటు బీజేపీ నాయకులు బాలకోటయ్య, జనసేన నాయకులు కనపర్తి మనోజ్ కుమార్, కందుకూరి రాంబాబు టంగుటూరి వెంకటకృష్ణ హాజరయ్యారు.

మరోసారి వైసీపీని ఆశీర్వదించండి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైకాపా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి జగనన్నను మరల సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి,మండల ఎంపీపీ గాయం సావిత్రి, మండల వైసీపీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం కిష్టంపల్లి గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల వైసీపీ నాయకులు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ను మరియు ఒంగోలు వైకాపా ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలకు,ఓటు వేసి అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు తెలియజేశారు.సంక్షేమ పథకాలు అందరికి అందాలంటే వైసీపీని గెలిపించాలన్నారు. సీఎం జగన్ చేసిన మేలులను చూసి ఓటు వేయాలని కోరారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి,సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్ రెడ్డి,వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నూతన గ్రేడ్ టొయోటా రూమియన్‌ను పరిచయం చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటర్

విశాలాంధ్ర-ఒంగోలు : టొయోటా కిర్లోస్కర్ మోటర్‌ను సోమవారం అధికారికంగా టొయోటా రూమియన్ యొక్క కొత్త గ్రేడ్ జి- ఏ టిధరతో పాటు ఈ -సిఎన్జి బుకింగ్‌లను తిరిగి తెరిచినట్లు అధికారకంగా ప్రకటించింది. కొత్తగా విడుదల చేసిన జి-ఏటి వేరియంట్ దాని సాటిలేని స్థలం, సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన, ప్రీమియం బాహ్య డిజైన్‌తో రూమియాన్ యొక్క మార్కెట్ ఆమోదాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. టి కేఎం యొక్క తాజా ఆఫరింగ్‌ను అత్యంత ఆకర్షణీయమైన ఎక్స్-షోరూమ్ ధర రూ. 13 లక్షల డెలివరీలు మే 5 నుండి ప్రారంభమవు తాయని భావిస్తున్నారు. వినియోగదారులు రూ. 11,000/- బుకింగ్ రుసుముతో ఏదైనా అధీకృత డీలర్‌షిప్‌లలో లేదా ఆన్‌లైన్‌లో వాహనాన్ని బుక్ చేసుకోవచ్చు. టికేయం వైస్ ప్రెసిడెంట్ - సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ శబరి మనోహర్, "టొయోటా రూమియన్ లైనప్‌కి కొత్త గ్రేడ్‌ను జోడించడానికి మేము సంతోషిస్తున్నట్లు నిర్వాహకులు చెపుతున్నారు.

టీడీపీ, వైసీపీలకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే

(మొదటిపేజీ తరువాయి)

చిచ్చు పెట్టి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బ గడుపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశంలో ప్రజలు శాంతియుతంగా స్వేచ్ఛగా జీవించగలిగారన్నారు. ప్రజల రక్షణ కోసం ఇండియా కుటమి అభ్యర్థుల గెలుపు ఆవశ్యం అన్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో రెండు దశాబ్ధాలు పైబడి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో భవనాలు, వాటర్‌ప్లాంట్‌లు నిర్మించి మీ కుటుంబంలో ఒకడిగా ఉన్నానని చెప్పారు. ఈ ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే మన ప్రాంతానికి కావాల్సిన నిధులు అభివృద్ధి చేసే బాధ్యత తనదే అన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని ప్రత్యేక హోదా ఇవ్వలేదని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెపుతున్నారని వారి తరం కాదన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో రూ. 50 కోట్లతో పర్యాటక రంగానికి పనులు ప్రారంభిస్తే తరువాత వచ్చిన ప్రభుత్వాలు వాటిని పట్టించుకోలేదన్నారు. 10 ఏళ్ల నుంచి బీజేపీ ప్రజల నోరు నొక్కి పాలన సాగిస్తున్నారని తెలిపారు. బీజేపీ నేతకు బాపట్ల పార్లమెంట్ బరిలో టీడీపీ తరుపున బరిలోకి దించారని మెడీ కావాలో జేడీ కావాలో నిర్ణయం మీ చేతుల్లోనే ఉందన్నారు. గత ఐదేళ్లలో ఎంపీగా ఉన్న నందిగం సురేష్ బాపట్ల పార్లమెంట్‌కు చేసింది ఏమీ లేదని నాకు ఒక్క అవకాశం ఇస్తే మీకు సేవ చేస్తానని తెలిపారు. మే13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఇండియా కుటమి అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రచారం ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని అన్ని విధాలుగా ఉపయోగించుకొని ఈ ఎన్నికల్లో గెలవాలన్న లక్ష్యంతో ఆదిమూలపు సురేష్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. నేడు టంగుటూరులో పాల్గొననున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వచ్చే వారంలో మరోసారి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

నేడు బాలకృష్ణ, లోకేష్ రాక :

కొండేపి నియోజకవర్గంలో సినీ నటుడు హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటిం చనున్నారు. కొండేపి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బాల వీరాంజనేయస్వామి గెలుపును కాంక్షిస్తూ జరుగుమల్లిలో బాలకృష్ణ టీడీపీ ప్రచారం నిర్వహించనున్నారు. నారా లోకేష్ ఒంగోలులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దామచర్ల జనార్ధన్ గెలుపును కాంక్షిస్తూ ఒంగోలులోని ఏవన్ ఫంక్షన్ హాల్ వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

అదే విధంగా ఈ నెల 3వ తేదీన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా దర్శి, గిద్దలూరు, ఒంగోలులో పర్యటించనున్నారు. ఈ మేరకు రూట్ మ్యాప్ సిద్ధమైంది. 2 లేదా 4వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలుపుతున్నారు. మొత్తం మీద తమ పార్టీ అభ్యర్థులను గెలిపించు కునేందుకు పార్టీల అగ్రనేతలు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

మమ్మరంగా అన్నా రాంబాబు ప్రచారం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మే నెల 13వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు నైన నన్ను ఒంగోలు పార్లమెంటరీ ఎంపీ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి అధిక మెజార్టీతో గెలిపించాలని మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా వెంకట్ రాంబాబు కోరారు. సోమవారం మండలంలోని విజయవర్ధిపాడు ,నాగంపల్లి సలనూతల, చినమనగుండం గొట్లగట్టు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజల ఉద్దేశించి మాట్లాడారు మీకు సేవకుడిగా పనిచేసే భాగ్యం నాకు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే మరల జగనన్న ను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకట్ రెడ్డి ఎంపీపీ మురళీకృష్ణ జడ్పీటీసీ సభ్యుడు అక్కిదా సరి ఏడుకొండలు మండల వైసీపీ కన్వీనర్ మోరా శంకర్ రెడ్డి వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంచికల్ చిన్న కోటేశ్వరరావు మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద్ద వెంకటరెడ్డి వైసిపి నాయకులు మాజీ సర్పంచి ఉడుముల గురువారెడ్డి ఆయా గ్రామాల వైసిపినాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న పరిపాలనకు ప్రజలు అండగా నిలవండి

కనిగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి దద్దాల మంజు భార్గవి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి దద్దాల మంజు భార్గవి సియస్ పురం మండలం తిమ్మరాజుపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని గెలిపించాలని అలాగే మన వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని సియస్ పురం మండల వైఎస్ఆర్‌సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

ఆర్టీసీ బస్సులో మంటలు

విశాలాంధ్ర-టంగుటూరు : షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగి ఇంజన్ భాగం దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి సూరా రెడ్డిపాలెం జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా కోదాడ బస్ డిపోకు చెందిన టీఎస్ 29 జడ్ 0046 నంబర్ గల బస్సు తిరుపతి నుండి హైదరాబాదు వెళు తూ ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో సూరారెడ్డిపాలెం జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్దకు రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమై అగ్నిమాపక వారికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మరియు హైవే పోలీస్ సింగరాయకొండ సిఐ డి రంగనాథ్ ఘటన స్థలానికి చేరుకొని వెంటనే మంటలను అదుపు చేశారు. అప్పటికే బస్సు ఇంజన్ భాగం వరకు దగ్ధమైంది. బస్సులో 25 మంది ప్రయాణిస్తుండడంతో వారందరినీ సురక్షితముగా కిందకు దింపారు. డ్రైవర్ అప్రమత్తతతో పోలీసులు వెంటనే స్పందించడం వలన ప్రాణాపాయం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

గొట్టిపాటి లక్ష్మీ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆవులు మంద పంచాయతీ పరిధిలో గల రామాంజనేయ కాలనీ నాంచారపురం మునయ్య కాలనీ మున్లగంగారం గ్రామాలలో జరిగిన ప్రచారంలో తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు గొట్టిపాటి లక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ మా అమ్మాయి లక్ష్మీని గెలిపించండి దర్శిలో అభివృద్ధి చేసి చూపిస్తాం మా బిడ్డగా మీ దగ్గరకు పంపించాము ఆదరించండి అభిమానించండి వచ్చేది మన ప్రభుత్వమే మన ప్రభుత్వంలో దర్శిని అభివృద్ధి ప్రాంతంగా అవసరమైన సదుపాయాలు కల్పించుకుందాం ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో తాగునీరు సాగునీరు లేక అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటికి శాశ్వత పరిష్కారం చేస్తామని మా గొట్టిపాటి కుటుంబం అంటే మీ అందరికీ తెలుసు మాట ఇచ్చామంటే మాట తప్పం మీ అందరికీ మరోసారి విన్నవించుకుంటున్నానని తెలుగుదేశం ఉమ్మడి కుటుంబం అభ్యర్థిని గొట్టిపాటి లక్ష్మీని మీరందరూ మనసారా ఆశీర్వదించి గెలిపించాలని అన్నారు అలాగే ఉమ్మడి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో గెలిచేది మన తెలుగుదేశం ప్రభుత్వమేనని 20 లక్షల మందికి యువతకుఉద్యోగాలు ఉపాధి నిరుద్యోగులకు యువగలము నిధి నుండి నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తుందని బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాల అండగా ఉంటుందని ఇంటింటికి మంచి నీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత త్రాగునీరు కులాయి కనెక్షన్లు ఇస్తుందని ప్రతి రైతుకు ఏటా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయము ఇస్తుందని మహాశక్తి తల్లికి వందనం ఆడబిడ్డ నిధి ఉచిత బస్సు ప్రయాణం దీపం పథకం క్రింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను పార్లమెంటు అభ్యర్థిగా మా గుంట శ్రీనివాస్ రెడ్డిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బిజెపి నాయకులు జనసేన నాయకులు గొట్టిపాటి లక్ష్మి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కందుల విజయాన్ని కాంక్షిస్తూ...తనయుడు విఘ్నేష్ ప్రచారం

విశాలాంధ్ర-మార్కాపురం : పొదిలి మండలంలోని నందిపాలెం గ్రామంలోని " ఇంటింటికి మన కందుల " ఎన్నికల ప్రచారం మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి మరియు ఒంగోలు పార్లమెంట్ కూటమి ఉమ్మడి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. విగ్నేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రకాలుగా సంక్షోభంలోకి కురుకపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ను ప్రకటిస్తానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో ఏ రోజు కూడా జాబ్ క్యాలెండర్ను ప్రకటించకపోగా, మరో వైపు ఉన్న ఉద్యోగాలను కూడా తీసేసారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు నేడు పథకం ద్వారా విద్యారంగంలో గొప్ప మార్పులు తీసుకొచ్చామని చెబుతున్న వైసిపి ప్రభుత్వం మరోవైపు ఒక్క ఉపాధ్యాయ పోస్ట్ కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్ని అంటాయని, పలితంగా సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని స్థితిలో కొట్టుమిట్టాడుతూన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుసరించిన తిరోగమన విధానాల పలితంగా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ మార్పు కోరుకుంటున్నారని రాష్ట్రానికి తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఎదురుచూస్తున్నారని విగ్నేష్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండలం తెలుగుదేశం నాయకులు మరియు నందిపాలెం పంచాయతీ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

కళాశాల బస్సు ఢీకొని విద్యార్థి మృతి

విశాలాంధ్ర-టంగుటూరు : సెమిస్టర్ పరీక్షలు రాయడానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన వల్లూరులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కొండపి కుమ్మరిపాలెం కు చెందిన దొర్నికుంట వెంకటేష్ (22) స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు హాజరవడం కోసం కళాశాల వద్దకు వెళు తుండగా పేస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్ ఢీకొనడంతో విద్యార్థి ఘటనా స్థలంలోనే రక్తపు మడుగులో మృతి చెందాడు. గమనించిన తోటి విద్యార్థులు తల్లిదండ్రులకు బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంకటేష్ విగతజీవిగా రక్తపు మడుగులో పడి ఉండడంతో తోటి విద్యార్థులు బంధువుల రోదనలు మిన్నంటాయి. కళాశాల యాజమాన్యం విద్యార్థి మృతి చెందిన పట్టించుకోక పోవడంతో విద్యార్థులు బంధువులు కళాశాల వద్ద ఆందోళన చేసి రోడ్డుపై బైఠాయించారు. పేస్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ఉంటే విద్యార్థి ప్రాణాలతో ఉండేవాడని బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో ఒంగోలు డిఎస్పి కిషోర్ సింగరాయకొండ సిఐ డి రంగనాథ్ జరుగుమల్లి ఎస్సై పేస్ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకొని మృతుని బంధువులను ఆందోళన విరమించాలని కోరారు. తమకు తగిన న్యాయం చేసే వరకు ఆందోళన విరమించబోమని చెప్పడంతో డిఎస్పి చొరవ తీసుకుని కళాశాల యాజమాన్యంతో చర్చలు జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు మృతుని బంధువులు ఆందోళనను విరమించారు.

టీడీపీలోనే ముస్లింలకు పెద్ద పీట

ఎన్డీఏ కూటమి కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు : టిడిపి ప్రభుత్వం లోనే ముస్లింల అభివృద్ధికి పెద్ద పీట వేయడం జరిగిందిని ఎన్డీఏ కూటమి కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణానికి చెందిన ఆదాంస గారి సాధక్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరగా కండవకప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రములో విధ్వంసిక పాలనకు చరమగీతం పాడి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులు రెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముస్లిం సోదరులకు ఉగ్ర నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలటిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటే శ్వర్లు, మాజీ యమ్. పి.పి గుంటుపల్లి దశరథ రాములు, తెలుగు యువత నాయకులు ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి యస్.డి అమీర్ బాబు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు యస్.కె గౌస్ బాష, యస్.కె నజీర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో తర్లుపాడు మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కటారి చిన్న కాశయ్య, మాజీ వైస్ సర్పంచ్ తంగిరాల చంటి తమ అనుచరులతో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మార్కాపురం పట్టణంలోని బాపూజీ కాలనీకి చెందిన వైసిపి పార్టీ వారు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎనిబర కిషోర్ ఆధ్వర్యంలో రెడ్డి పోగు యేసు రత్నం, గుడితోటి వెంకటేశ్వర్లు, గుంటు ప్రభాకర్, అంబడిపూడి కిరణ్, చప్పిడి వంశీ, బత్తుల రాము, బత్తుల లక్ష్మణ్, దమ్ము పవన్, తిరుమల దాసు, చిలకపాటి శివ, షేక్ ఇమాంస, రెడ్డి పోగు ఆనంద్ తదితర 15 కుటుంబాలు మార్కాపురం నియోజకవర్గ ఎన్డిఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

కురిచేడు టౌన్ వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర-కురిచేడు : మండల ప్రధాన కేంద్రమైన కురిచేడు టౌనుకు సంబంధించిన 20 మంది వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ రాజీనామా పత్రాలను స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీతారామయ్యకు అందించారు. మేము స్వచ్ఛందంగానే రాజీనామాలు చేస్తున్నామని మాపై ఎటువంటి పొలిటికల్ ఒత్తిళ్లు వ్యక్తిగత ఒత్తిళ్లు లేవని స్వహస్తాలతో రాజీనామాలు రాసి అందించారు. ఒకేసారిగా టౌన్‌లో 20 మంది వాలంటరీలు రాజీనామాలు చేయటం హాట్ టాపిక్‌గా మారింది. తదుపరి వారు మా పయనం వైయస్ జగన్ అన్న వెంట మా అడుగు బూచేపల్లి శివన్న వెంట అంటూ స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ కార్యక్రమంలో కురిచేడు మండల వైఎస్ఆర్సిపి నాయకులు షేక్ సైదా మాజీ ఎంపీపీ మేరువ సుబ్బారెడ్డి ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో బూచేపల్లి వెంకాయమ్మ

విశాలాంధ్ర-కురిచేడు : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నందిని సోమవారం గడపగడపకు కార్యక్రమంలో మండుటెండను సైతం లెక్కచేయకుండా దర్శి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ భూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గెలుపు కోసం గడపగడపకు తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు నుసం రెడ్డి బజారులో మహిళలు అత్తా కోడలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. శివ ప్రసాదరెడ్డి గెలుపు కోసం సిద్ధం అంటూ బోర్డింగులతో స్వాగతం పలికారు. మెయిన్ రోడ్డు వైశ్యుల బజారు వాల్మీకి సెంటర్లో ప్రచారాన్ని పూర్తి చేశారు ప్రతి గడపకు తిరుగుతున్న సమయంలో తోబుట్టువు వచ్చినంత సంతోషంగా ఆనందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు అభిమానులు బూచేపల్లి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బోణీ కొట్టేనా?

■ శింగరాయకొండ ఓట్లే కీలకం ■ సీనియర్ల మధ్య దీటైన పోటీ

విశాలాంధ్ర-శింగరాయకొండ : జిల్లావ్యాప్తంగా కొండెపి నియోజకవర్గం ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. ఇద్దరు సీనియర్ పొలిటీషియన్స్ మధ్య సాగుతున్న ఈరాజకీయ కుస్తీ ద్వారా వచ్చే ఫలితం ఎలా ఉంటుందన్న విషయంపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఈఎన్నికల్లో విజయం సాధిస్తే టిడిపి అభ్యర్థి బాలవీరాంజనేయస్వామి రికార్డు సృష్టిస్తారు. అదే సురేష్ విజయం సాధిస్తే జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గెలుపొందిన ఏకైక నాయకునిగా రికార్డులకెక్కుతారు. వార్ వన్‌సైడ్ అవుతుందని అందరూ తొలుత ఊహించినా ఇపుడు అన్ని సర్వేలు కీన్ ఫైట్ అని చెబుతున్నాయి. మరి బయటపడే దెవరన్నది ఆసక్తికరం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన తరువాత బోణీ కొట్టని నియోజకవర్గంగా ఉన్న కొండెపిలో మరి ఆదిమూలపు సురేష్ తొలిసారి జెండా ఎగురవేస్తారా లేదా అని ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొండెపి నియోజకవర్గంలో 2014,2019 ఎన్నికల్లో టిడిపి తరుపున పోటీచేసిన బాలవీరాంజనేయస్వామి గెలుపొందిన విషయం తెలిసిందే. కేవలం గెలవడమే కాదు... రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు కూడా ఆయన పొందారు. స్వల్పమెజారిటీలతోనే రెండుసార్లు ఆయన గెలుపొందినప్పటికీ శింగరాయకొండ మండలంలో మెజారిటీ వైపు దృష్టిసారించి విజయం సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన పరిణామాలు కూడా మూలగుంటపాడు పంచాయతీలో టిడిపికి పట్టు పెరిగేలా చేయగలిగాయి. ఈనేపథ్యంలో బాలవీరాంజనేయస్వామి హ్యాట్రిక్ ఖాయమని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. అయితే పైకి గందరగోళంగా కనిపిస్తున్నాసీనియర్ పొలిటీషియన్‌గానూ, మంత్రిగానూ ఉన్న ఆదిమూలపు సురేష్ వ్యూహాలు వైసిపి గెలుపుకు పునాది వేస్తున్నాయి. వ్యక్తుల కంటే వ్యవస్థను నమ్మే సురేష్ ఒకరిద్దరు పార్టీ నుండి వెళ్ళిపోయినా... బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. నియోజకవర్గానికి వచ్చి రెండు నెలలే అయినా నేరుగా ఓటర్లతో అనుబంధం పెంచుకోవడంలో కృతకృత్యులయ్యారు. చాలా ప్రాంతాల్లో కొత్త నాయకులు సురేష్ చుట్టూ చేరుతుండటం, వారి సామర్థ్యానికి తగ్గట్టుగా ప్రాధాన్యత ఇచ్చి ఎన్నికల బాధ్యతలు అప్పగించడంతో చాలాకాలంగా పార్టీలో ఉన్న వారికి కొంత మనస్తాపం కలుగుతోంది. అందుకే పార్టీ మారినట్లు నటించడం, సురేష్ బుజ్జగించాలని వేచి చూడటం జరుగుతోంది. అయితే ఈవిషయాలేవీ ఆయన పట్టించుకోవడం లేదు. తనకంటూ వర్గాన్ని తయారు చేసుకోవడంలో విజయవంతం అయ్యారు. మాలమహానాడు వైసిపికి మద్దతు తెలపడంతో సురేష్ కీలక పాత్ర పోషించారు. మాగుంట ద్వారా టిడిపికి ఓటింగ్ పెరుగుతుందని భావించిన చోట చాలా తెలివిగా ఓట్లు చీల్చగలిగారు. తన సామాజిక వర్గం ఓట్లను గంపగుత్తగా తెచ్చుకోవడంలో విజయం సాధించారు. ఇలా ఒక్క శింగరాయకొండ మండలంలోనే అనూహ్యంగా వైసిపికి గ్రాఫ్ పెంచడంలో సురేష్ సఫలం అయ్యారు. అయితే ఈప్రాంత రాజకీయాలకు కొత్త అయిన సురేష్ గతంలో ఎర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో భారీ మెజారిటీలతో విజయం సాధించారు. తొలుత కొండెపి కొత్తగా ఉందని మాట్లాడిన ఆయన ఇపుడు కొండెపిలో విజయం సాధిస్తామని ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కూడా హామీ ఇస్తున్నారు. మొత్తం మీద నియోజవర్గంలో వైసిపి ఊపు చూస్తుంటే ఎంత్కెనా సురేష్ వ్యూహం మామూలుగా లేదని అభిమానులు చెప్పుకుంటున్నారు.

వైసీపీ అభ్యర్థులను గెలిపించండి

షంషీర్ అలీ బేగ్ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం : ఒంగోలు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం పొదిలి పట్టణంలో మైనారిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బెగ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అట్టడుగు వర్గాలు ముఖ్యంగా మైనారిటీల ఆర్థిక అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. గతంలో పాలక వర్గాలన్ని మైనార్టీలను కేవలం ఓట్ బ్యాంకు గానే పరిగణించాయని, అయితే అందుకు భిన్నంగా వైసిపి ప్రభుత్వం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఎంతో కృషి చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో అలాగే 7 ఎమ్మెల్యే టికెట్లను, నాలుగు ఎమ్మెల్సీ పదవులను 13 కార్పొరేషన్ చైర్మన్ ల పోస్టులను ఒక్క మైనారిటీలకే కేటాయించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఎంపీ అభ్యర్థి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబులను మే నెల 13వ తేదీ జరగబోవు ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ మైనారిటీలకు పిలుపునిచ్చారు. మైనారిటీ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాష మాట్లాడుతూ స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి నాటి ప్రభుత్వ హయాంలో నాలుగు శాతం ముస్లింలకు రిజర్వేషన్లు సౌకర్యం కల్పించడం వల్లనే నేడు ఉమ్మడి రాష్ట్రంలో వేలాదిమంది మైనారిటీ విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించుకొని ఉన్నతమైన జీవనాన్ని గడుపుతున్నారని అన్నారు.

పట్టణ వైసిపి అధ్యక్షురాలు ఎస్.కె నూర్జహాన్ మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి, రాంబాబుల విజయం కోసం ప్రతి ఒక్క ముస్లిం సోదరులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అకుంఠిత దీక్షతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత వేగంతో అభివృద్ధి సాధిస్తుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో వైసిపి పార్టీకి చెందిన పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-దొనకొండ: మే నెల 13న జరుగు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఒంగోలు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఈదా సుధాకరరెడ్డి కోరారు. దొనకొండ పట్టణంలో ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టారి కొండారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం, రోడ్డు షో సోమవారం నిర్వహించారు. సుధాకరరెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్ళుగా ఎంపీగా చేసిన మాగుంట ఏ అభివృద్ధి చేశారంటూ ప్రశ్నించారు. వైసీపీ అభ్యర్థి భాస్కరరెడ్డికి సైతం జిల్లాలోని సమస్యలు తెలియవన్నారు. ఒంగోలులో పుట్టి పెరిగిన తనకు జిల్లా సమస్యలు క్షుణ్ణంగా తెలుసని, తనను ఆదరించి ఓట్లు వేసి గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే అభ్యర్థి కొండారెడ్డి కూడా లోకల్ వ్యక్తి అని, మీ అందరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొండారెడ్డి మాట్లాడుతూ తమను ఆదరించి ఓట్లు వేస్తే విమానాశ్రయం అభివృద్ధి చేయటం, గుండ్లకమ్మకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు, చందవరం బౌద్ధ స్తూపాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటం, దర్శిలో యర్రచెరువుని మంచినీటి చెరువుగా మార్చటం, డ్రైవింగ్ స్కూల్ పూర్తి చేయటం, ముండ్లమూరు, తాళ్ళూరు కూరగాయల రైతు మార్కెట్ ఎక్స్‌పోర్ట్స్ సెంటరు ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నకోటయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొప్పుల సాయిక్రిష్ణ, సీపీయం కార్యదర్శి తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సోషల్‌మీడియా చైర్మన్ కొండ గురవయ్య, దాసరి రాము పాల్గొన్నారు.

వైసీపీతోనే పేదలకు సంక్షేమం,అభివృద్ధి

- ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

విశాలాంధ్ర - కర్లపాలెం : రాష్ట్రంలో ఉన్న పేద బడుగు బలహీన వర్గాలకు గత ఐదు సంవత్సరాలలో ఇచ్చిన సంక్షేమ పథకాలకు మరికొన్ని జోడించి సంక్షేమం వైపు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి వారిని తోడుకొని వెళుతున్నారని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ తెలియ జేశారు. కర్లపాలెం మండలం పాత నందాయపాలెం పంచాయతీలోని ఎస్టీ కాలనీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన నవరత్నాలకు తోడు మరికొన్ని పథకాలను జోడించి పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం విశేషంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నా రన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మేనిఫెస్టో సైతం ఆ వర్గాలను దృష్టిలో పెట్టుకుని రూ పొందించారన్నారు. బాపట్ల అభి వృద్ధిలో ఎమ్మెల్యేగా కోన రఘుపతి ఐదు సంవత్సరాల కాలంలోని ఎంతో అభివృద్ధి చేశారని రానున్న ఐదు సంవత్సరాల కాలంలో నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని మండలాలను గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా కోన రఘుపతి ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్ ను అత్యధిక మెజార్టీతో గెలి పించాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఓటు అడుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఏడు కొండలు, సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి హరిబాబు రెడ్డి, సర్పంచులు దేవర కొండ అంకమ్మ రమేష్,కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరెడ్డి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షంషేం ఎంపీటీసీ నాయకులు పేరాల వెంకట సురేష్, గోపిరెడ్డి,బెనర్జీ, వార్డు మెంబర్లు గోవతోటి దేవదాస్, పులుగు నాగరాజు రెడ్డి,నాగిరెడ్డి హరి రెడ్డి, జానీ రవికుమార్, కంకిపాటి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని ముక్తేశ్వరం వైదన గ్రామాల నుంచి పలువురు వైకాపాను వీడి సోమవారం అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే గొట్టిపాటి పార్టీ కండవాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ గ్రామాలలో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు.సార్వత్రిక ఎన్నికలలో ప్రతి గ్రామం నుండి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు.కూటమి అధికారంలోకి వస్తే అమలు చేయు సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. మే 13 న జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీలోకి చేరిన వారిలో ముక్తేశ్వరం గ్రామం నుండి చెన్నూరి శివప్రసాద్,శంకర్ శెట్టి వెంకట కోటేశ్వరరావు,చెన్నూరి నాగార్జున, గుంటుపల్లి గోపి,జాగర్లమూడి హరీష్,నాగళ్ళ మణికంఠ,షేక్ తంగిళ్ళ,షేక్ మహమ్మద్,పసుపులేటి మధుబాబు,నాగళ్ళ బాలకృష్ణ,నాగళ్ళ శేషుబాబు, గుంటుపల్లి అంకమ్మరావు,షేక్ నాగూర్ వలి,షేక్ కరీం భాషా,మాసాని అంజి వైదన గ్రామం నుంచి గోపి,పావులూరి వీరాంజి, కె.శివయ్య,బొజ్జా కోటయ్య, గంపా చిన అక్కయ్య,పొదిలి రాముడు,బందారు మల్లికార్జునలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం, నగరం మండలాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెరుకుపల్లి విద్యుత్ శాఖ డీఈఈ అర్.విజయ్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కె.వి రేపల్లె సబ్ స్టేషన్ నందు మం మ్మతుల నిమిత్తం నిజాంపట్నం, నగరం మండలాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉచితంగా ఫుట్‌బాల్ శిక్షణ

విశాలాంధ్ర - చీరాల : ప్రతిభ కలిగిన స్థానిక క్రీడాకారులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు గత పదిహేనేళ్లుగా ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని వేసవి శిక్షణా క్యాంపు ఆర్గనైజర్ బొనిగల ప్రేమయ్య అన్నారు.సోమవారం చీరాల ఎన్ ఆర్ పి ఎం హైస్కూల్ ఆవరణలో ఉచిత వేసవి ఫుట్ బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్ర మంలో బొనిగల ప్రేమయ్య మాట్లాడుతూ చీరాల నియో జకవర్గంలోని ఫుట్ బాల్ క్రీడాకారులు ఈ వేసవి శిక్షణా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు 8309607343, 9866802309ను సంప్రదించాలన్నారు. క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏపీ ఫిషర్ మెన్ కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్‌గా కోపనాతి నాగబాబు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లెకు చెందిన కోపనాతి నాగబాబును ఆంధ్రప్రదేశ్ ఫిషర్ మెన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్‌గా నియ మిస్తూ అధ్యక్షులు కదిరి జగ న్నాథం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు నాగబాబు తెలిపారు .కోస్తా తీర ప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధికి సంక్షేమానికి తాను శాయ శక్తుల పనిచేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కే.జగన్నాథంకు,ఏఐసీసీ అధ్యక్షులు మల్లికా ర్జునఖర్గేకు ,వర్కింగ్ ప్రెసిడెంట్ సోనియాచ రాహుల్ గాంధీ, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిలకు ,నాగబాబు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగాలు

- మోపిదేవి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రేపల్లె : దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనకు పట్టం కడితే నిరుద్యోగులకు 30 లక్షలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రేపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోపిదేవి శ్రీనివాసరావు స్పష్టం చేశా రు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ, పది సంవత్స రాలు ప్రత్యేక హోదా, నిరుపేద కుటుంబాలకు రూ.5 లక్షలతో పక్కా గృహాల నిర్మాణం, వృద్ధులకు రూ 4000, వికలాంగులకు రూ 6000 పెన్షన్లు అందజేస్తామని చెప్పారు. టీడీపీ,వైసీపీ డొల్ల హామీలతో మోసపోవద్దని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జెడి శీలం, రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మోపిదేవి శ్రీనివాసరావు అను నాకు మీ పవిత్రమైన ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర సీపీఐ సమితి సభ్యులు పి . నాగాంజనే యు లు, రేపల్లె సీపీఐ ఏరియా కార్యదర్శి జి .బాలాజీ, సీపీఎం రేపల్లె కార్యదర్శి సిహెచ్ మణిలాల్, కాంగ్రెస్ నాయకులు, కేసన రామ కోటేశ్వరరావు, స్వామి నారాయణమూర్తి, నాగ బాబు, కూనపు రెడ్డి వెంకటేశ్వర్లు, ఆలూరు నారాయణ, దేవ సహాయంలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర - చీరాల : మేము సైతం కరణం గెలుపు కోసమంటూ చీరాల నియోజకవర్గంలోని పట్టణం,మండలం అనే తేడా లేకుండా వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి కరణం వెంకటేష్ కు మద్దతు తెలుపుతున్నారు.కరణం బలరామకృష్ణమూర్తి చీరాల నియోజక వర్గ శాసనసభ్యులుగా ఎన్నికయ్యాక చీరాలలో ప్రశాంత వాతావరణం ఏర్పడిందని చీరాల మున్సిపాలిటీలో పార్కుల అభివృద్ధి,రోడ్ల అభివృద్ధి జరిగాయని,ఆయన తనయుడు కరణం వెంకటేష్ ను శాసన సభ్యుడిగా గెలిపించుకుంటే చీరాల అభివృద్ధి పథంలో దుసుకెళ్తుందని పలువురు రాజీనామా చేసిన వాలంటీర్లు అన్నారు.ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ తనపై ప్రేమతో స్వచ్ఛందంగా రాజీనామా చేసి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని అన్నారు.రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్ రెడ్డి రావాలని ప్రజలందరు జగనన్నకు మద్దతుగా నిలవాలని అన్నారు.

'వేగేశన' విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : పిట్టలవానిపాలెం మండలం కత్తివారిపాలెం గ్రామానికి చెందిన 31 మంది కత్తి నాగమణి, కర్లపూడి రమేష్, కె.విజయ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. బాపట్ల నియోజకవర్గ టీడీపీ,బీజేపీ,జనసేన ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ రాజు వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా ప్ర తి ఒక్కరూ పని చేయాలని కోరారు. గొవతోటి బాల,కర్లపూడి సౌజన్య, చెట్టుపల్లి మణెమ్మ,కర్లపూడి కుమారి, కంచెర్ల యేసుదాసమ్మ, ఏపూరి ప్రేమవతి, చెట్టుపల్లి నవామి, వీరంకి భాగమ్మ, కుళ్ల రవితేజ, తదితరులు పార్టీలో చేరారు.

బాపట్ల,చీరాల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా రంగారావు

విశాలాంధ్ర - చీరాల : చీరాల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దేవరపల్లి రంగా రావు అధిష్ఠానం తనను పట్టించుకోలేదని కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన విషయం పాఠకులకు విదితమే. అయితే దేవరపల్లి రంగారావు సేవలను గుర్తించిన కాంగ్రెస్ పెద్దలు సోమవారం కాంగ్రెస్ బాపట్ల జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబును చీరాల పంపించి దేవరపల్లి రంగారా వును బుజ్జగించారు.ఈ సందర్భంగా గంటా అంజిబాబు మాట్లాడుతూ చీరాలలో కాంగ్రెస్ అంటే రంగారావు అని గత పదేళ్లుగా రంగారావు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించారన్నారు.పార్టీ కోసం కష్టపడిన నాయకులను పార్టీ ఎన్నటికీ వదులుకోదని కాంగ్రెస్ కోసం కష్టపడి పని చేసిన రంగారావును బాపట్ల,చీరాల నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులుగా నియమిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో దేవరపల్లి రంగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన సేవలను గుర్తించలేదని రెబల్ అభ్యర్థిగా తన అనుచరుల కోరిక మేరకు పోటీలో నిలచానని పార్టీ తన సేవలను గుర్తించింది కనుక పోటీలో నుంచి తప్పుకుంటున్నానన్నారు. బాపట్ల,చీరాల నియోజక వర్గాల ఎన్నికల ఇన్‌ఛార్జిగా ప్రకటించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల,జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు,చీరాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచికృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మోర్లవారిపాలెం సర్పంచ్ లక్ష్మీ తిరుపతమ్మ టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె రూరల్ మండలం మోర్లవారిపాలెం సర్పంచ్ మోర్ల లక్ష్మి తిరుపతమ్మతో పాటు పది కుటుంబాలు సోమవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేజెండ్ల పూర్ణానంద్, తాత ఏడుకొండలు, మోర్ల కృష్ణారావు, కే వెంకటేశ్వర్లు, తేజ పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకి పెన్షన్ జమ

విశాలాంధ్ర-పీసీపల్లి : మే 1వ తేదీ పెన్షన్ల కొరకు ఎవరూ సచివాలయం దగ్గరకు రానవసరం లేదని బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి నగదు బదిలీ ద్వారా నేరుగా ఖాతాల్లోకి సొమ్ము జమ చేయటం జరుగుతుందని ఎంపీడీవో వెంకట సుబ్బారావు తెలిపారు. బ్యాంక్ అకౌంట్ ఆధార్‌తో మ్యాప్ అయిన లబ్ధిదారులందరికీ ఇది వర్తిస్తుందని బ్యాంకు ఖాతాలు లేని వారు, దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణీ స్త్రీలు నడవలేక వీల్‌చైర్లకు పరిమితమైన వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటికే వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. నగదు బదిలీ జరిగే లబ్ధిదారుల పేర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది మొబైల్ యాప్‌లలో కనిపించవన్నారు. నగదు బదిలీ ద్వారా పెన్షన్ పంపిణీ చేసే వారి వివరాలు గ్రామ, వార్డ్ సచివాలయాల్లో అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. మే 1 తేదీన పంపిణీ ప్రారంభించి 5వ తేదీ లోగా పూర్తి చేయటం జరుగుతుందని తెలిపారు.

'దద్దాల' వినూత్న ప్రచారం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పట్టణంలో సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్- కనిగిరి కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేశారు. టీ తయారు చేసి కార్యకర్తలకు అందజేస్తు ప్రజలతో మమేకమవుతూ పండ్లు , కూరగాయలు ఇస్త్రీ బండ్లు, కిరాణా కొట్లు మరియు రోజు వారి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తాను అన్నారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే తనను ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గారిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైయం ప్రసాద్ రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏయంసీ చైర్మన్ సాల్మన్ రాజు, జడ్పీటీసీ కస్తూరి రెడ్డి, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకీ వెంకటేశ్వర్లు, ఎస్వీఎస్ గోవర్ధన్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, కౌన్సిలర్ దేవకి రాజీవ్, వైసీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా' జనం కోసం జనార్ధన్ '

విశాలాంధ్ర-ఒంగోలు : ఎన్నికల ప్రచారంలో భాగంగా గడప గడపకు జనంకోసం జనార్ధన్ పేరుతో ఒంగోలు నగరంలో 33వ డివిజన్ నందు విస్తృతంగా ఎన్నికల ప్రచారం న?టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన మరియు బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ రావు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు యోగయ్య యాదవ్,డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటసుబ్బారెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కాబడ్డ జాల్ల పాలెం గ్రామానికి చెందిన దొడ్డ వెంకటసుబ్బారెడ్డిని టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన సోమవారం టిడిపి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని టీడీపీ గుండెలలో పెట్టుకుంటుందని అందుకు తగ్గట్టు వారికి గుర్తింపును ఇస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యద్దనపూడి సాల్మన్ రాజ్, యూత్ అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి, వెన్న రమణారెడ్డి, బబ్బా భూపాల్, కొటికల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు సమన్యాయం

- జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేశారని జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో తో సర్పంచ్ కటికల రిబ్కా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పేద బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట మేనిఫెస్టో వేశారని అంతే కాక నవరత్నాల పేరుతో పేద ప్రజలందరికీ నేరుగా లబ్ధి చేకూరు తుందని, ఐదు సంవత్సరాల సుపరి పాలన అందించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ప్రజలందరూ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఈ క్రమంలో కనిగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించు కుందామని అన్నారు, గ్రామంలో ప్రజలందరికీ మేనిఫెస్టో పత్రాన్ని అందించి వైసీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి, నాగూర్ యాదవ్, కనిగిరి నియోజ కవర్గం ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి ఎంపీటీసీ పాప బత్తిని నాగేశ్వరరావు సేవాదళ్ అధ్యక్షుడు చెన్న కృష్ణయ్య వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ సచివాలయ కన్వీనర్ పొల్ల సుబ్రహ్మణ్యం మండల యూత్ అధ్యక్షుడు దమ్ము కేశవులు, ఎలుక రమణయ్య, రమణయ్య, శివరాం రెడ్డి, గంజి వెంకటరెడ్డి వెంకట రమయ్య, తాతపూడి నాని, ఎలుక బ్రహ్మయ్య మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర రెడ్డి వెన్న తిరుపతిరెడ్డి, దండు జయరాం రెడ్డి, మాజీ సర్పంచ్ ముసలయ్య, గోన రమేష్ ,పసుపు దేవదానం, వార్డు సభ్యులు అశోక్ పాల్గొన్నారు.

వైసీపీ మేనిఫెస్టోలో దివ్యాంగులకు అన్యాయం

వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన మానిఫెస్టోలో పెన్షన్ల పెంపు రూ. 3500 అని చెప్పారు కానీ, అందులో వికలాంగుల ఊసే లేదని, వికలాంగులకు సిఎం జగన్మోహన్ రెడ్డి పూర్తిగా అన్యాయం చేశారని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య విమర్శించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వికలాంగులు ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచుతారని చాలా ఆశగా ఎదురు చూశారన్నారు. కానీ రూ.500 పెంచుతున్నామని, అది కూడా 250 రూపాయల ప్రకారం రెండు విడతలుగా ఐదు సంవత్సరాలలో పెంచుతామని చెప్పి వికలాంగుల ఆశలపై నీళ్లు చల్లారని, పూర్తిగా అన్యాయం చేశారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ రూ. 6,116లు ఇస్తున్నారని, ఏపిలో టీడీపి మానిఫెస్టోలో రూ. 6 వేలు, కాంగ్రెస్ పార్టీ కూడా రూ. 6 వేలు పెట్టిందని, వైసీపీ మాత్రం వికలాంగులకు అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలలో ఆ వికలాంగులతో సహా సామాజిక పింఛన్‌దారులు కూడా వైసీపీకి సత్తా ఏమిటో చూపిస్తారన్నారు.

మల్లెల దేవిడ్ మృతి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి మల్లెల దేవిడ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని దేవిడ్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగౌడ్, మల్లెల తిరుపతయ్య, వెంకటేశ్వరరెడ్డి,చెన్నయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, కొండయ్య, ఆదాము, యేసు, నాగేశ్వరరావు,సుబ్బారావు, వేములపాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో 25 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో గడికోట పంచాయతీ మాజీ సర్పంచులు ముచ్చుకుండ్ల రామసుబ్బయ్య, మందగిరి రంగస్వామి, దూదేకుల నరసింహులు ఆధ్వర్యంలో దేవనగరం గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు మెంబర్లతో సహా 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో స్థానికంగా ఉండే అశోక్ రెడ్డి గారి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరిన వార్డు మెంబర్లు తాళ్ల శ్రీనివాసులు, కసినా వెంకటేశ్వర్లు తాళ్ల బాల గురువయ్య నల్లమేకల రమణయ్య మందగిరి తిరుపతయ్య తానం శ్రీధర్ గుర్రపుసల వెంకట రమేష్ తాళ్ల శ్రీను వరాలు అల్లం వెంకటేశ్వర్లు చలివేంద్ర చిన్న గోపాల్ పెద్ద గోపాల్ పెరుగు వెంకటరమణ తాళ్ల బాలయ్య దండే ఓబయ్య అల్లం నారాయణ పోతుగంటి చిన్నకాశయ్య, మూలంటి మురళి, మూడమంచు తిరుమలయ్య, కసినే పెద్ద ఓబులేసు, వంగూరి చిన్న గురుస్వామి, అల్లం శ్రీను, బైనేని స్వామిదాసు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండల కేంద్రమైన సంతనూతలపాడు శాంతినగర్ కాలనీ సమీపంలో టివిఎన్‌టియుసి మండల అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు పాల్గొని చలివేంద్రం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెరుకూరి హరి కృష్ణ చెరుకూరి శ్రీనివాసరావు చెరుకూరి వెంకట సుబ్బయ్య నార్నె మాధవి ముప్పరాజు శ్రీనివాస రావు పావులూరి నారాయణ చౌదరి అట్లూరి బిక్షాలు ఆదిత్య తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో 'దద్దాల' ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం తాళ్లూరు పంచాయతీలోని పాలూరి వారిపల్లి గ్రామంలో సోమవారం కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మాజీ సర్పంచ్ మూలే మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ప్రజా సంక్షేమ పాలనకు ప్రజలందరూ మద్దతు పలికి తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా.. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ క్రమంలో ఎనిమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలు ప్రసాద్ టీడీపీ వీడి వైసీపీలో చేరారు. పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైయం ప్రసాద్ రెడ్డి, తాలూరు సర్పంచ్ మంగతాయారు, వెంకట్రావు, గుడిపాటి వెంకటరెడ్డి, సంఘన గురు బ్రహ్మయ్య, ఎస్కే రహీం, మూలే బయన్న, గాలి వెంకటేశ్వర్లు, తాడికట్ల శ్రీను, పాలూరి నాగిరెడ్డి, బుజ్జి, పాలూరి సుబ్బారెడ్డి, బలరామిరెడ్డి, నలబాల కొండారెడ్డి, అబ్బెలం, సుబ్బయ్య, కోటిరెడ్డి, బాలు వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఎనిమిరెడ్డి ఆదిరెడ్డి, ఎనిమిరెడ్డి ప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలకృష్ణ స్వర్ణాంధ్ర సాధికార యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడులో నేడు మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరిగే స్వర్ణాంధ్ర సాధికార ఎన్నికల ప్రచార యాత్ర కార్యక్రమానికి యువరత్న నందమూరి బాలకృష్ణ విచ్చేయుచున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు తెలిపారు. టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి బియన్ విజయ్ కుమార్ బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తేనేటి కృష్ణ ప్రసాద్ కూడా హాజరవుతారన్నారు.

ఎన్నికల ప్రచారంలో కిషోర్

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని కూకట్లపల్లి గ్రామంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ కు మద్దతుగా గొట్టిపాటి కమల కిషోర్ (బాబి) సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు.సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకుంటూ మే 13న జరగనున్న ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ కు మరియు బాపట్ల ఎంపీ అభ్యర్థి తేనేటి కృష్ణ ప్రసాద్ లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా గత తెలుగుదేశం పార్టీ హయాంలో అద్దంకి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో గొట్టిపాటి రవి కుమార్ ముందుకు తీసుకువెళ్లారని, గత ఐదేళ్ల నుండి అద్దంకి నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు.జగన్ మోహన్ రెడ్డి సంక్షేమం పేరిట రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాడని,అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని మళ్ళీ సన్ రైజ్ రాష్ట్రంగా నిలిపేందుకు సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో పేద ప్రజల కుటుంబాలలో టీడీపీ వెలుగులు నింపనుందని తెలిపారు.అవ్వ తాతలకు ఏప్రిల్ నెల నుండే 4,000 వేల రూపాయలు ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు 18 సం?లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 వందలు తల్లికి వందనం పథకం క్రింద చదువుతున్న ప్రతి చిన్నారికి సంవత్సరానికి 15 వేలు,ప్రతి పేదకుటుంబానికి సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు అందించనున్నట్లు కమల కిషోర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నేతలు కార్యకర్తలు గొట్టిపాటి పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఔదార్యం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరు గ్రామానికి చెందిన కుమ్మిత పేరారెడ్డి గ్రామంలో అవసరమైన పలు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. దివ్యాంగుడు అయినప్పటికీ సామాజికంగా గ్రామానికి సహాయ చేయడం పట్ల పలువురు ప్రశంసిస్తున్నారు. గతంలో సచివాలయానికి వెళ్లే దారిలో సైడ్ కాలవ మీద తుమ్ము పగిలిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రెండు సిమెంటు గొట్టాలు వేయించాడు. స్మశాన వాటిక వద్ద దారి లేకపోవడంతో డోజర్ ద్వారా రోడ్డు వేయించి సిమెంటు గొట్టాలు వేయించాడు. రెడ్ల బజారులో రెండు చోట్ల సిమెంట్ పైపులు వేయించాడు. గుంటలు పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో 40 ట్రిప్పులు మట్టి తొలించి రోడ్డును బాగు చేయించాడు. ఎస్సీ కాలనీ వద్ద రెండు సిమెంటు గొట్టాలు ఏర్పాటు చేయించాడు. తాజాగా బీసీ కాలనీ వద్ద వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు పడు తున్న సమయంలో మూడు గొట్టాలు వేయించి ప్రజల అవ సరాలను తీరుస్తున్నాడు. దీంతో గ్రామస్తులు అభినందించారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

◈ జిల్లాలో 12.91 లక్షల మంది ఓటర్లు

◈ ఎంపీకి 15 మంది, ఎమ్మెల్యే స్థానాలకు104 మంది పోటీ

◈ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా విడుదల చేశారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగియడంతో బరిలో ఉండే అభ్యర్థుల పేర్లను ఆయన అధికారికంగా ప్రకటించారు. అనంతరం అభ్యర్థులకు గుర్తింపు చిహ్నాలను కేటాయించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి మీడియా సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో 6,29,794 మంది పురుష ఓటర్లు ఉండగా, 6,61,841 మంది మహిళ ఓటర్లు, 81 మంది ఇతర ఓటర్లు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. జిల్లాలో మొత్తంగా 12,91,716 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో కలుపుకొని మొత్తం 104 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. మే 13వ తేదీన ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 337 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. మొత్తంగా 68శాతం పోలింగ్ కేంద్రాలలో అంటే 1,030 పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రఫీ, వెబ్ క్యాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లను నియమిస్తామన్నారు. అలాగే సంతనూతలపాడు నియోజకవర్గంలోని 128 పోలింగ్ కేంద్రాలలోనూ పై విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ కొరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో డిస్పాచ్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బంది నియామకం పూర్తి చేశామన్నారు. వారికి మొదటి దశ శిక్షణ పూర్తి కాగా, మరోసారి మే నెల ప్రారంభంలోనే శిక్షణ ఇస్తామన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన హెూమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వారి నుంచి 955 దరఖాస్తులు అందాయన్నారు. విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు వినియోగించుకోవడానికి ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న వారికి బాపట్ల జిల్లా కేంద్రంలోనే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అత్యవసర సేవలలో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నంగాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పగటి ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతున్నందున ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద షామ్యాన, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగుల కొరకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి మీడియా, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు.. ప్రజల జీవితాలకు వెలుగు

◆ మాజీ కేంద్రమంత్రి ఎంపీ అభ్యర్థి జేడీ శీలం

◆ టీడీపీ, వైసీపీ నుంచి భారీ చేరికలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : దేశ ప్రగతి కోసం ప్రశాంతత కోసం ఏర్పడిన ఇండియా కూటమి అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కేంద్రమాజీ మంత్రి జేడీ శీలం కోరారు. బాపట్ల పార్టీ కార్యాలయంలో సోమవారం వైసీపీ టీడీపీలను వీడి కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరారు. ఈ సందర్భంగా జేడీ శీలం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాలనా లో జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. బాపట్ల, చీరాల అసెంబ్లీలలో కాంగ్రెస్ గెలుపు ఖాయం అన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లా బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. పరిశ్రమలు తీసుకు వచ్చి యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. 5 సంవత్సరాలు ఎంపీ గా ఉన్న నందిగ సురేష్ బాపట్ల జిల్లా కొరకు చేసిన అభివృద్ధి ఏమి చేసినాడో చూ పించాలన్నారు. టిడిపి ఎంపీ అభ్యర్థి తన్నెటి కృష్ణప్రసాద్ తెలంగాణ లో బిజెపి నాయకుడు అని అతనికి ఓటేస్తే మోడీకి ఓటేసినట్లేనని ఆర్ఎస్ఎస్ భావజాలాలు కలిన వ్యక్తి అని అతనికి ఓట్లు వేసి గెలిపిస్తే జిల్లా 10 సంవ త్సరాలు వెనక్కి వెళుతుందన్నారు. జిల్లా ప్రజలు ఒకసారి ఆలోచించి మోడీ కావాలా జేడీ కావాలా అనేది జిల్లా ప్రజలు నిర్ణయించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబును చూసి తమ ఓటు బ్యాంకు చీలుతుందని వైసీపీ, టీడీపీ ఆందోళన ఉన్నారన్నారు. ప్రజలతో మమేకమవుతూ సాగుతున్న కాంగ్రెస్ నేత అన్ని సామాజిక వర్గాల్లోనూ సానుకూలత పట్ల రాజకీయాలు రోజురోజుకూ వేగంగా మారుతున్నాయన్నారు.నిన్నమొన్నటి వరకు ప్రధాన పార్టీలు తమ గెలుపుపై ఒక అంచనాలో ఉన్నారని తాజాగా బాపట్ల రాజకీయ ముఖచిత్రంపై ఎన్నో ఏళ్లుగా పరిచయమున్న గంటా అంజిబాబు నేరుగా ఎన్నికల రణ రంగంలోకి అడుగు పెట్టడంతో ప్రధాన పార్టీల్లో గుబులు మొదలైందన్నారు. సామాజిక వర్గాల వారీగా ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసేందుకు పావులు కదిపిన వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం పార్టీ గంటా రాకతో ఏమవుతుందోనని భయపడుతున్నాయన్నారు. జిల్లాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు జె బి శ్రీధర్ మాట్లాడుతూ గంటా అంజిబాబు 30 ఏళ్లుగా బాపట్ల ప్రాంతంలో రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఇప్పుడు ఇండియా కూటమి తరుపున కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుండడంతో పాత కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతా అంజిబాబు వెనుక నడిచేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఓటర్లను తన వైపు తిప్పుకోగలిగిన సామర్థ్యం గంటా అంజిబాబుకు ఉండడంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఏ నోట విన్నా అంజిబాబు మాటే వినిపిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున గంటా అంజిబాబు పోటీకి ఉండటంతో ఎన్డీఏ కూటమి నేతలకి భయం పట్టుకుందన్నారు. అనంతరం బాపట్ల టౌన్ లోని బాబు జగ జీవన్ రావు నగర్ కాలనీ వాసులు మాజీ కౌన్సిలర్ ఆద్వర్యంలో 50 మంది, జమేదర్ పేట వాసులు 15 మంది కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబు రావు, సాగర్ , కుమార్, శంకర్ రెడ్డి, రోశయ్య, రేణుక, కార్యకర్తలు అభిమానులు తదితరుల పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా: బూచేపల్లి

విశాలాంధ్ర-దర్శి : కార్మికుల్లో కార్మికుడి నై మీకు అండగా ఉండాలని దర్శి వైసిపి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం దర్శి నగర్ పంచాయతీ పరిధిలోని ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఆంజనేయ స్వామి టెంపుల్ లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇస్త్రీ కార్మికులు ఆటో కార్మికులతో ముచ్చటించారు ఇస్త్రీ పెట్టెతో ఇస్త్రీ చేస్తూ ఆటో నడుపుతూవారి సమస్యలను తెలుసుకున్నారు. నర్సీపట్నం సమస్యలను అధికారం చేపట్టిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఇంటింటికి తిరుగుతూ ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్ రెడ్డి, వెన్నపూస బాపిరెడ్డి, వేమిరెడ్డి చెన్నారెడ్డి, సద్ది పుల్లారెడ్డి, కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

దొనకొండలో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం

విశాలాంధ్ర-దర్శి : దర్శి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పుట్లురు కొండారెడ్డి నీ ఎంపీ అభ్యర్థి ఇదా సుధాకర్ రెడ్డిని హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సోమవారం దర్శి మండలం మరియు దొనకొండ మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలో బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చుకోవాలని హస్తం గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పుట్లురు కొండారెడ్డిని ఎంపీగా ఈద సుధాకర్ రెడ్డిని గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు. సీపీఐ నాయకులు మడపాకుల రమేష్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ప్రచారం

విశాలాంధ్ర-గిద్దలూరు : నియోజకవర్గంలోని అర్ధవీడు మండలంలో కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో టిడిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, గిద్దలూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, జనసేన పార్టీ ఇన్ చార్జ్ బెల్లంకొండ సాయిబాబు పాల్గొన్నారు. ముందుగా అర్ధవీడులో ఎన్డీఏ కూటమి కార్యకర్తలు నిర్వహించిన భారీ ర్యాలీలో వీరు పాల్గొన్నారు. అలానే మార్కాపురం జిల్లాగా చేసేందుకు కట్టుబడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపల్లెలో 14 మంది అభ్యర్థులు పోటీ

విశాలాంధ్ర - రేపల్లె : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రేపల్లె శాసనసభ నియోజకవర్గం నుండి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు రేపల్లె ఆర్డిఓ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హే లా షారోన్ తెలిపారు .పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆయా పార్టీలు కేటాయించిన గుర్తులతో పాటు ఇండి పెండెంట్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరిగిందని ఇందుకు సంబంధించి నోటీసు బోర్డుపై అతికించి నట్లు ఆమె తెలిపారు.

వర్మను గెలిపించండి మీ రుణం తీర్చుకుంటాడు

- సతీమణి హరికుమారి ప్రచారం

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల టీడీపి, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ రాజును గెలిపించండి మీకు సేవకుడిగా పనిచేసి మీ రుణం తీర్చుకుంటాడని ఆయన సతీమణి హరికుమారి పిట్టలవానిపాలెం మండలం కోమలి గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు లోకల్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక సమస్యలను తప్పక పరిష్కరిస్తాడని తాగునీరు, సాగునీరు, పంటకాలువల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, వీధి దీపాలు, అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులు మొదలగు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కారం చూపుతారని హరికుమారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు లోకేష్ యువతతో ముఖాముఖి

విశాలాంధ్ర-ఒంగోలు : రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావటమే లక్ష్యంగా ప్రచారాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రచార కార్యక్రమాలలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శినారా లోకేష్ యువగళం పేరుతో ఒంగోలులోయువతతో ముఖాముఖి మంగళవారం నిర్వహించనున్నారు. ఈపాటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లనుటిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిదామచర్ల జనార్దన్ రావు పరిశీ లించారు. ఆయన మాట్లాడుతూఈ కార్యక్రమానికి ఒంగోలు నియోజక వర్గంలోని యువతే కాకుండా,జిల్లావ్యాప్తంగా యువత, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అవకాశం ఇవ్వండి..సమస్యలు పరిష్కరిస్తా

టీడీపీ అభ్యర్థి వేగేశన

విశాలాంధ్ర - కర్లపాలెం : ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపిచండి నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని టీడీపీ అభ్యర్థి వేగేవన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని బుద్దాం, యాజలి, దమ్మనవారి పాలెం గ్రామాల్లో సోమవారం విస్తృతం ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు వేగేశన నరేంద్ర వర్మరాజు బ్రహ్మరథం పట్టారు, స్థానిక సమస్యలపై ఆయన మాట్లాడుతూ సాగు నీరు, తాగునీరు, వీధిలైట్లు, పంట కాలువల నిర్వహన మురుగు కాలువల ప్రక్షాళన చేసి సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుకి ఓటేసి టీడీపి, బీజేపీ, జనసేన, పార్టీలు బలపరిచిన నరేంద్ర వర్మ రాజు అనే నన్ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను కుల మతాలకతీతంగా, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించాలనే ధ్యేయంతో సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలను అమలు చేసి ప్రజల జీవితాల్లో కొత్తవెలుగులు నింపుతామని వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రజలకు హామీ ఇచ్చారు. చంద్రన్న సూపర్ సిక్స్ పథకాలే కాకుండా ఈ ప్రాంతం బిడ్డగా లోకల్ మేనిఫెస్టోను సిద్ధం చేసి అద్వానంగా ఉన్న రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, మొదలగు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ

తీసుకుంటానని వేగేశన ప్రజలకు భరోసా ఇచ్చారు. అలాగే బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు బలపరిచిన ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ని సైకిల్ గుర్తుపై ఓటేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపి, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, సంకీర్ణ పార్టీల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న హర్షవర్ధన్

విశాలాంధ్ర - అద్దంకి : తన తండ్రి అద్దంకి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ గెలుపు కోసం తనయుడు హర్షవర్ధన్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ సోమవారం పట్టణంలోని నాలుగవ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువత అంటే కలల ఖనిజాలు అని అలాంటి ఖనిజాలకు గులకరాయిపాటి విలువ కూడా జగన్ ఇవ్వడం లేదని. నోటిఫికేషన్ల మాయ చేసి, ప్రైవేటు కంపెనీలను తరిమేసి, నైపుణ్యాభివృద్ధి నిలిపేసి యువతను నిరుద్యోగులుగా మార్చేశారని హర్షవర్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు, జగన్ రెడ్డి ఐదేళ్లలో నిరుద్యోగ యువత ఉపాధి వెతుక్కుంటూ పరాయి రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి కల్పించారని ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలంటే ఏ మాల్స్ లోనో నాల్లోనో పనులు చేసుకునే దుస్థితిలోకి నెట్టారన్నారు. కాలేజీ కుర్రాళ్లు కలిస్తే ఉద్యోగం కోసం ఏ రాష్ట్రం వెళ్తున్నావ్ అనే చర్చే నడుస్తోందని మళ్లీ జగన్ రెడ్డి అధికారంలోకి వస్తే నవ్యాంధ్ర వృద్ధాంధ్రగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి

రాగానే చదువుకున్న నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో 4 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన,నిరుద్యోగ యువతకు 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి, ముఖ్య మంత్రి అయిన తర్వాత మొదటి సంతకం డీఎస్సీ పైన పెడతానని చంద్రబాబు నాయుడు కూడా హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పథకాల అమలులో ఎటువంటి వివక్ష లేకుండా అందించి పేద ప్రజలను ఆదు కుంటామని హామీ ఇచ్చారు. చంద్రబాబు నాయుడుకి సంపద సృష్టించగల సమర్థత ఉందని, స్పష్టమైన విజన్ ఉన్న నాయకుడని, యువత కలల సౌధాన్ని నిర్మించడం అలాంటి నాయకత్వానికే సాధ్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన,బిజెపి నేతలు కార్యకర్తలు గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీలో పలు కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని ఎస్ ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పట్టణ వైయస్సార్సీపి యువ నాయకులు పిల్లిమెట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపిని వీడి సోమవారం అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి హనిమిరెడ్డి పార్టీ కండవాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో పసలా పవన్ కళ్యాణ్,అంబటిఅశోక్,దేవా,నాగార్జున,వినోద్,కృష్ణ,తిరుపతయ్య,వెంకీ,ప్రదీప్,అనిల్,అమీర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో నాయకులు కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి సార్వత్రిక ఎన్నికలలో గ్రామం నుండి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కావాలంటే మరొకసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

దివ్యాంగులకు,వితంతువులకు పెన్షన్లు

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలో 4949 మంది పెన్షన్స్ ప్రతినెల రూ. 14832500లు వృద్ధులు వితంతువులు దివ్యాంగులు ఒంటరి మహిళలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో సీతారామయ్య సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. వీరికి మే నెలలో3860 మందికి డిబిటి బ్యాంకు జమ ద్వారా రూ11580000లు పెన్షన్ జమ చేయడం జరుగుతుందని అలాగే 1089 మందికి నాన్ డిబిటి ద్వారా రూ 3252500లు మే నెల ఒకటవ తేదీ రెండవ తేదీలలో గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ దారుల ఇండ్లకు వచ్చి పంపిణీ చేస్తారని తెలియజేశారు బ్యాంకుల ద్వారా జమ చేసిన వారి వారి అకౌంట్ల నుండి ఏటీఎం ద్వారా తీసుకోవచ్చని ఎంపీడీవో సీతారామయ్య తెలియపరిచారు.

హామీలు అమలు చేయని జగన్

- టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : ఓటు వేసిన ప్రజలను బానిసలుగా చూసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయని సీఎంగా చరిత్రలో నిలిచిపోతాడని తెలుగుదేశం జనసేన బిజెపి ప్రజా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం హనుమోజిపాలెంలో జనసేన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ పర్చూరు నియోజకవర్గ జనసేన ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌తో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో వైసిపి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. వైసిపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి లేక రాష్ట్రం 10 సంవత్సరాలు వెనకబడి పోయిందన్నారు. ఇసుక మొదలుకొని మద్యం వరకు ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారన్నారు. పట్టిసీమ మర్చిపోయారు, ప్రజల జీవ నాడి పోలవరం ఆపేశారని మండిపడ్డారు. సాగుకు నీరు లేక ప్రజలకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉచితంగా దొరికే ఇసుకను ఇష్టం వచ్చినట్లు అమ్మేసుకుని వేల కోట్లు సంపాదించారని పేర్కొన్నారు. కేసుల మాఫీ కోసం అబద్దాలతో అధికారంలోకి వచ్చి అభివృద్ధిని మరిచిపోయారన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచక పోగా అప్పులు చేసి ప్రభుత్వాన్ని నడుపుతున్నారన్నారు. 2014-15 లో నాగార్జునసాగర్ కాలువలు తెలుగుదేశం పార్టీ 13 కోట్లతో మరమ్మత్తులు చేయించి రైతులకు సాగు నీరు అందించామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతాంగాన్ని పట్టించుకునే పరిస్థితిలో లేదన్నారు. ప్రభుత్వం వల్ల ఉపాధి లేక ఉద్యోగాలు లేక ప్రజలు వలసలు పోయే పరిస్థితి ఏర్పడిందని ఈ పరిస్థితులు పోవాలని ఉద్దేశంతో ఈ మూడు పార్టీలు ఏకమయ్యాయన్నారు. ఈ దుష్ట ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడంలో ప్రజలు భాగస్వామ్యం

కావాలని పిలుపునిచ్చారు. జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పర్చూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి పనిచేశారని గుర్తు చేశారు. ఆత్మీయ సమావేశానికి జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.